www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 28 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

## కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి



-10వేల ఇందిరమ్మ ఇండ్లకు స్లాబింగ్ పూర్తి
-దిశ సమావేశంలో పథకాలపై సమీక్షించిన ఎంపి, కలెక్టర్

2లో

# పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య





-న్యాయం జరిగే వరకు పోరాటం
-ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపే పరిష్కారం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య అని కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వితండవాదం చేస్తున్నారని పేదల పట్ల ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. శుక్రవారం వెలుగుమట్ల నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్న టిటిడిసి, అంబేడ్కర్

మిగతా 2లో..

## నిర్వాసితులకు తక్షణం లక్ష సాయం అందించాలి

-ఇండ్లు కోల్పోయిన వారందరికీ న్యాయం చేయాలి
-పిల్ల కాకులకు ఏమి తెలుసు కమ్యూనిస్టుల పోరాటాలు
-మీడియా సమావేశంలో వామపక్ష నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** వెలుగుమట్ల నిర్వాసితులు మూడు రోజులుగా అల్లాడుతున్నారని వారికి తక్షణ ఆర్థిక సాయం క్రింద లక్ష రూపాయలు ప్రతి కుటుంబానికి అందించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. రోజు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వీరికి ఇప్పుడు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయని ఈ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మీడియా సమావేశంలో వారు

మిగతా 2లో..

## వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయం చేస్తున్నారు..



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భూదాన్ భూముల విషయంలో మాజీ మంత్రి కేటిఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భూదాన్ భూములపై ప్రతిపక్షాలు తల ఒక మాట చెబుతున్నాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ భూదాన్ భూముల పరిష్కారం చేయకపోవడంతో ఇప్పుడు సమస్య వచ్చిందన్నారు. జిల్లా మంత్రులు పేదలకు వ్యతిరేకం కాదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వారు మంత్రులుగా ఉండి పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. దళారుల మాటలతో అక్కడ నివాసం ఉంటున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. పేద ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రతిపక్షాలకు హితవు పలికారు. భూదాన్ భూముల్లో పేదల నుండి డబ్బులు వసూలు చేసిన వారిని శిక్షించాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ఎ బ్లాక్ అధ్యక్షులు బాలగంగాధర్ తిలక్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సాధు రమేష్‌రెడ్డి, గంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

## పేదల గుడిసెలు కూల్చిన పాపం మంత్రులదే..

-బాధితులను బెదిరిస్తున్న అధికారులు
-మీడియా సమావేశంలో తాతా మధు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో పేదల ఇండ్లను కూల్చిన పాపం జిల్లాకు చెందిన మంత్రులదేనని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు ఆరోపించారు. కాంగ్రెస్ వస్తే పక్కా ఇండ్లు వస్తాయని పేదలు భావిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉన్న ఇండ్లను పడగొట్టిందని ఆయన తెలిపారు. నిర్వాసితులు కేటిఆర్ పర్యటన సందర్భంగా అక్కడకు వస్తే వారిని పెయిడ్ ఆర్టిస్టులుగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూదాన్ స్థలాల్లో ఉన్న వారికి సైతం పట్టాలు ఇప్పిస్తామని సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు ప్రశ్నకు సమాధానంగా చెప్పారని మరి ఇప్పుడు ఎందుకు కూల్చారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మంలో పేదల విషయంలో బిఆర్ఎస్ ఏమి చేసింది ఇప్పుడు కాంగ్రెస్ ఏమి చేస్తుందన్న దానిపై బహిరంగ చర్చకు

మిగతా 2లో..

# పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య





(మొదటిపేజీ తరువాయి)
భవన్‌లోని బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారు, ఎంత కాలంగా నివాసం ఉంటున్నారు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్న కూనంనేని పేదలకు కనీస అవకాశం ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి ఖమ్మం వచ్చి తలదాచుకునేందుకు భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకోవడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. మీరు పాకిస్తానీలు, బంగ్లాదేశ్ వారు కాదు కదా చుట్టు పక్కల వారే కదా అని ఆయన తెలిపారు. వెలుగుమట్లలోనే ఇల్లు ఇల్లు తిరిగి సర్వే చేసి ఒకవేళ అనర్హులు ఉంటే చర్యలు తీసుకుంటే బాగుండేదని అలా కాకుండా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించి పిల్లలు, వృద్ధులు, మహిళలు అనేది చూడకుండా వీధిన పడేయటం వికృతమైన ప్రజాస్వామ్యమని కూనంనేని ప్రశ్నించారు. ఒకసారి కాకపోతే పలుసార్లు సంప్రదింపులు జరపాలని పేదలను సంతృప్తిపరిచి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యకు పరిష్కారం చూపకుండా బాధితులపై నేరం మోపడం అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల్లో ఉన్న పేదలకు పట్టాలు అందజేస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారని కూనంనేని గుర్తు చేశారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని న్యాయం జరిగే వరకు పేదల పక్షాన పోరాడతామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంలో చొరవ చూపి బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి అవి అమలు జరిగేవిధంగా చూడాలన్నారు. కొందరు కమ్యూనిస్టుల గురించి తెలియక స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నారని కూనంనేని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదని వేల మందికి పోరాట ఫలితంగా నివాస స్థలాలు దక్కాయని ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ కాలువ కట్టలపై గుడిసెలు వేసిన తర్వాత వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపి సంతృప్తి చెందిన తర్వాతే గుడిసెలు తొలగించడం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడు ఉదయ్‌కుమార్ నగర్ పేరుతో వందలాది మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడటం, పేదలకు అండగా నిలవడం మా బాధ్యత అని దానిని ఎవరు గుర్తు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పునరావాస కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఎక్కడ నుంచి తొలగించారో అక్కడే పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. ఉన్నతాధికారులు ఏ లక్ష్యం కోసం ఆ భూమి నుంచి పేదలను ఖాళీ చేయించారో వివరించాల్సిన అవసరం కూడా అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలు కూల్చిన పాపం మంత్రులదే..

(మొదటిపేజీ తరువాయి)
సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. వెలుగు మట్ల బాధితుల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందని ఒక పక్క పోరాటాలు, మరో పక్క న్యాయస్థానంలోనూ పేదల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. కలిసి వచ్చే అన్ని పార్టీలతో కలిసి ముందుకు సాగుతామని తాతా మధు స్పష్టం చేశారు. ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణం పునరావాసం కల్పించాలని, ఎక్కడ ఇండ్లు కూల్చారో అక్కడే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితులను అధికారులు బెదిరిస్తున్నారని ఇది సరైంది కాదని అధికారులు తమ తీరు మార్చుకోవాలన్నారు. మీడియా సమావేశంలో డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, శేషు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజలకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రాయోజిత పథకాలను జిల్లాలో పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ సభ్యులు రఘురాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఎంఎల్ఏలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు నివేదికలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం స్థానంలో నూతనంగా వచ్చిన వికసిత్ భారత్ జి రాం జీ పథకం మార్గదర్శకాలు ప్రతి ప్రజాప్రతినిధికి అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నడిచే వివిధ వైద్య సేవలలో ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం ఆసుపత్రి మరమ్మత్తు, క్రిటికల్ కేర్ బ్లాక్, ఇతర మౌలిక వసతుల పనుల పురోగతి వివరాలు అందించాలన్నారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో అధికంగా సి సెక్షన్ ఆపరేషన్స్ జరుగుతున్నాయని దీనిపై కలెక్టర్ సమీక్షించాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని, నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ త్వరగా ఓపెన్ అయ్యేలా సంబంధిత మంత్రితో సమావేశమై కృషి చేస్తానని ఎంపి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోని ఐటిఐ, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పెద్ద ఎత్తున ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. రాబోయే రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు రవాణా కోసం వినియోగించే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను జిల్లా అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని రూ. 45 లక్షలతో ప్రతి పాఠశాలకు గ్యాస్ సిలెండర్ సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో పోడు పట్టాలలో బోర్లు వేసుకునేందుకు కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామని దీని వల్ల సర్వైకల్ క్యాన్సర్ రాకుండా చేయవచ్చునన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ చివరి దశకు చేరుకుందన్నారు. జిల్లాలో పదివేల ఇందిరమ్మ ఇండ్లకు స్లాబింగ్ పూర్తయిందన్నారు. వీటిని రెండు నెలల్లో పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేలా చేస్తామన్నారు. ఎంఎల్‌సి, ఎంఎల్ఏలు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు తక్షణం లక్ష సాయం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)
మాట్లాడుతూ నిరుపేదల ఇండ్లను కూల్చి వారిని నిరాశ్రయులను చేశారని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చి వేయడం ఏ రకం ప్రజాస్వామ్యమని వారు ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూల్చినట్లు కాకుండా పోలీసులు, అధికారుల తీరు చూస్తుంటే శత్రు రాజ్యంపై దండెత్తినట్లు ఉందని వారు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్లలోని 148, 149 సర్వే నెంబర్లలో పదేళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులకు కనపడ లేదా అని వారు ప్రశ్నించారు. ఒక పక్క మండుతున్న ఎండలు, మరో పక్క పరీక్షా సమయంలో ఇండ్లను కూల్చడం కక్ష సాధింపు చర్యే అన్నారు. 250 కోట్ల రూపాయల ఆస్తిని స్వాధీనం చేసుకున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వారు ఈ జిల్లాలో భూదానోద్యమం సందర్భంగా సేకరించిన 300 ఎకరాల భూమి ఏమైందో చెప్పాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. పెద్దలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే రకరకాల జీవోలు తెచ్చి క్రమబద్ధీకరణ చేశారని పేదల విషయంలో అలా ఎందుకు చేయలేదని వారు ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ అదే స్థలంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

**చరిత్ర తెలియని వారే విమర్శిస్తున్నారు...**

ప్యాకేజీలలో ఉండి కమ్యూనిస్టుల గురించి తెలియని వారు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఈ పిల్ల కాకులకు కమ్యూనిస్టుల పోరాటాల గురించి ఏమి తెలుసని వారు ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయబడిందని వారు తెలిపారు. ఖమ్మం నగరం చుట్టూ పక్కలతో పాటు ప్రతి గ్రామంలోనూ పేదల నివాస స్థలాల కోసం పోరాడి సాధించిందని కమ్యూనిస్టులేనని అందుకు ఇప్పటికీ ఉన్న కాలనీలే సాక్ష్యమని వారు తెలిపారు. ప్యాకేజీ బ్యాచ్‌కి కమ్యూనిస్టుల గురించి ఏమి తెలుసునని ప్రశ్నించారు. పాలకులు అమలు చేస్తున్న ప్రతి పథకం వెనక కమ్యూనిస్టుల పోరాటాలు దాగి ఉన్నాయని కమ్యూనిస్టులను విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నిర్వాసితులకు అన్ని విధాలా అండగా ఉంటామని వారికి న్యాయం జరిగేంత వరకు వామపక్షాల పోరాటం కొనసాగుతుందని వారు తెలిపారు. మీడియా సమావేశంలో వివిధ వామపక్షాల నేతలు మేకల శ్రీనివాసరావు, వై. విక్రం, ఆవుల అశోక్, పాముల మోహన్‌రావు, రాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సత్తుపల్లి: తమ ఐదేళ్ల పాలన ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత అన్నారు ఎమ్మెల్యే రాగమయి. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెండింగ్‌లో ఉన్న పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని, అయితే నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపిడిఓలకు ఆదేశించారు. నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలుఎండలు ముదిరే లోపే మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు ప్రతి ఆవాస ప్రాంతాన్ని సందర్శించి, నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, మిషన్ భగీరథ శాఖల ఉన్నతాధికారులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపిడిఓలు ప్రతినిధులు పాల్గొన్నారు.

# సిపిఐ నేత బుర్ర సతీష్ మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ.పాలెనికి చెందిన సిపిఐ నాయకుడు బుర్ర సతీష్(45) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పోసంగుల చంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యంలో ప్రోటీన్ కీలకం



**-విద్యార్థులు, స్థానికులకు ప్రోటీన్‌పై అవగాహన**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుందని వి. వెంకటాయపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐబి గ్రూప్ ఏబీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రోటీన్‌పై విద్యార్థులకు, స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపా ఆదినారాయణ మాట్లాడుతూ మన ఆరోగ్యంలో ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మన శరీరానికి అవసరమైన ప్రధాన పోషకాలలో ప్రోటీన్ ఒకటన్నారు. ప్రోటీన్ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. విద్యార్థులు సాంకేతికతను అవసరం మేర మాత్రమే వినియోగించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐబి గ్రూప్ సంస్థ జోనల్ హెడ్ రఘు మాట్లాడుతూ శరీర నిర్మాణం, కండరాల బలవృద్ధి, రోగ నిరోధక శక్తి పెంపు వంటి అనేక అంశాలలో ప్రోటీన్ ముఖ్యమైన పోషక పదార్థమన్నారు. ప్రోటీన్ వల్ల శరీరంలోని కణాలు, కండరాలు, చర్మం, జుట్టు, నఖాలు వంటి భాగాల నిర్మాణానికి ఎంతో అవసరమన్నారు. ప్రోటీన్ సమృద్ధిగా ఉంటే రోగ నిరోధక శక్తి పెంపుదలతో పాటు గాయాలు త్వరగా మానడం, హార్మోన్ల ఉత్పత్తి, పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రోటీన్లు గుడ్లు, పాలు, పెరుగు, పప్పులు, శనగలు, బాదం, వేరు శనగలు, చికెన్, చేపలు వంటి వాటిలో అధికంగా లభిస్తుందన్నారు. ఐబి గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో పౌల్ట్రీ రంగంలో నాణ్యమైన కోళ్లను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ఎటువంటి ఇంజక్షన్లు లేకుండా కోళ్ల పెంపకంలో పోషకాలు కలిగిన ఫీడ్, సోయాబీన్స్ వంటి దాణాలను అందిస్తున్నట్లు తెలిపారు. చికెన్ తినడం వల్ల ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐబి గ్రూప్ రీజినల్ హెడ్ రత్నాజీ, ఈసీ ఫామ్స్ నిర్వాహకులు కుర్రా భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, పశు వైద్యులు కృష్ణ, స్థానిక నాయకులు కాపా భుచక్రం, ఐబి గ్రూప్స్ మేనేజర్ ప్రశాంత్‌రెడ్డి, స్థానికులు కిలారు వెంకట రమణ, కుతుంబాక సత్యనారాయణ, అంకప్పారావు, జగన్ మోహన్‌రావు, చంద్ర సత్యంబాబు, అమరనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ

**- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ముందస్తు జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీ 6వ వార్డులోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్‌శాఖ రూపొందించిన అరైవ్‌అలైవ్ ప్రచారంలో భాగంగా విద్యార్థులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అలాగే రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా చేయడమే ధ్యేయమన్నారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్‌అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసు



కోవాల్సిన 10 జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతిరెడ్డి, రమణమూర్తి, శ్రీనివాసులు, సిఐలు మురళి,సంజీవ్, సత్యనారాయణ, రాజు, కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి



**-అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మేయర్ పును కొల్లు నీరజ తెలిపారు. శుక్రవారం నగరంలోని 35వ డివిజన్‌లో వాస వీ కళ్యాణ మండపం ఎదురుగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు మేయ ర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో అవసరమైన అభివృద్ధి పనులను దశల వారీగా చేపడు తున్నామన్నారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, కాంగ్రెస్ ఎ బ్లాక్ అధ్యక్షులు బాలగంగాధర్ తిలక్, వెండి, బంగారం అసోసియేషన్ అధ్యక్షులు బందు సూర్యం, నకిరికంటి రాధాకృష్ణ, సతీష్, గడ్డం శ్రీనివాసరావు, కుంకిమళ్ల వేణుగోపాల్, రచ్చా శ్రీనివాసరావు, ఎడంకంటి రామారావు, సుంకరి వెంకటేశ్వర్లు, దినేష్ నాయుడు, డిఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

# అపరాల సాగుపై రైతులు దృష్టిసారించాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం ఉండే అపరాల సాగుపై రైతులు దృష్టి సారించాలని రఘునాథపాలెం మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా శుక్రవారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండా క్లస్టర్ పరిధిలో రైతులకు పెసర పంటపై అవగాహన కల్పించేందుకు ఫీల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అపరాల పంట సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అపరాలు సాగు చేయవచ్చునని ఆదాయం కూడా బాగుంటుందన్నారు. ప్రస్తుతం పెసర పంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతి ఉందన్నారు. రైతులు దీని నివారణకు తీసుకోవాల్సిన



చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మంగ్యా తండా సర్పంచ్ మాలోత్ బాల్‌సింగ్, ఏఈవో సాయి వేదవ్యాస్, ఆత్మ డైరెక్టర్ అంగోతు వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ చొరవతో బోరు ఏర్పాటు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈ నెల 17న కమిషనర్‌కు ఏదులాపురం మున్సిపాలిటీ 32వ వార్డులోని స్మశానవాటికలోని సమస్యలపై కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మున్సిపాలిటీ నుంచి శుక్రవారం నూతన మంచి నీటి బోరును ఏర్పాటు చేపించారు. తొలుత కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి దానిని ప్రారంభించారు.



ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, సిపిఐ మున్సిపాలిటీ నాయకులు వెన్నం భాస్కర్, మామిడి శంకర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు గణపరపు ఉపేందర్, యువజన సంఘం సభ్యులు ఏర్పుల లింగయ్య, మామిడాల కిరణ్, రెడ్డిబోయిన వెంకటేష్, దొంతగాని ఉపేందర్, మొగిలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంపీ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ 2వ వార్డులోని కరుణగిరిలో అక్కడి యూత్ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పాలేరునియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఖమ్మం నగరంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం



ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువతో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్ల నిర్వహణ అవసరమన్నారు. ఎటువంటి ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించాలని, కాంగ్రెస్ యువనేత ఏనుగు మహేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీ క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ కొప్పుల చంద్రశేఖర్, టోర్నీ నిర్వాహకులు అక్కిరాజు, నరేష్, పి. సంపత్, జి. శ్రీకాంత్, నాయుడు, పావెల్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

**ప్రజాపక్షం/ మధిర :** ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింతగా ఎదిగి ప్రజాక్షేత్రంలో తమ ప్రతిభను చాటాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ రంగా హన్మంతరావు అన్నారు. శుక్రవారం మధిర శ్రీ



వాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన మైలవరపు సత్యనారాయణని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగా హన్మంతరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న పేద ఆర్యవైశ్యులను ప్రతిఒక్కరూ ఆదుకుని అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఐక్యతతో ముందుకు సాగితే ఆర్యవైశ్యుల శక్తి మరింత బలపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, వనమా వేణుగోపాలరావు, కురువెళ్ళ వెంకటపురుషోత్తరావు, పుల్లఖండం సత్యనారాయణమూర్తి, గుండెల ముత్తయ్య, వంగవీటి రాజశేఖర్, దాచేపల్లి రాము, కాజా చక్రధరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, భవిరిశెట్టి సాంబశివరావు, వేముల నవీన్‌కుమార్, కొత్తమాసు రామారావు, సముద్రాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆందోళన

**ప్రజాపక్షం/ మధిర :** విద్యార్థినిల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మండల పరిధిలోని దెందుకూరు జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో



పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడని, వెంటనే ఆ ఉపాధ్యాయుని సస్పండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఈ ఉపాధ్యాయుడిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని, ఇలాంటి ఉపాధ్యాయున్ని మందలించాల్సిన ఉపాధ్యాయ సంఘ బాధ్యులు వెనకేసుకురావడం శోచనీయమని తల్లిదండ్రులు, గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి తగిన విచారణ జరిపించి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# ఘనంగా సాయిబాబా పల్లకి సేవ

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయ 18వ వార్షికోత్సవాన్ని గత రెండు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం బాబావారి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పల్లకిని ఆలయ కమిటీ నిర్వాహకులు పల్లకి సేవ మోస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



కాంగ్రెస్ పార్టీ నేత తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపిటిసి తుమ్మలపల్లి సత్యవతి దంపతులు పల్లకి సేవలో పల్లకిని మోశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన సాయిబాబు భక్తులందరూ వార్షిక కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా శనివారం ఆలయం వద్ద మహాన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు దుగ్గినేని గోపయ్య, నున్నా సొందిపులు, పునాటి సత్యం, ఆపతి రామారావు, పాపినేని మధు, మారెళ్ళ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ



ప్రజాపక్షం/పాల్వంచ : గుడిపాడు గ్రామంలో నూతనంగా శ్రీమోక్ష వేంకటేశ్వరస్వామి ఆలయ పునప్రతిష్ట సంధర్భంగా నిర్వహించిన స్వామి వారి కళ్యాణానికి అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నుండి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అన్నపురెడ్డిపల్లి దేవాలయం నుండి పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను మేళతాలాలతో గుడిపాడు శ్రీమోక్ష వేంకటేశ్వరస్వామి కళ్యాణానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రతీ సంవత్సరం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తామని గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ రాథోడ్ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రసాదాచార్యులు, ఆలయ సిబ్బంది రామారావు, నర్సింహులు, సంపత్, శివాలయం వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు, శివాలయం చైర్మన్ మల్లెల నరసింహరావు, గ్రామ సర్పంచ్ లకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, తేజావత్ వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి విశేష పూజలు

**- అమ్మవారిని దర్శించుకున్న శ్రీలంక సుప్రీం కోర్టు జడ్జి**



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం రగామాల మధ్యన కొలువైఉన్న (శ్రీకనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు జరిపించారు. పంచామృతాలతో వైభవముగా అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవాలయ అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్దన ఉన్న అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అమ్మవారిని దర్శించుకున్న జడ్జి :** శ్రీలంక సుప్రీం కోర్టు జడ్జి ఎన్. సురాజ్ రాజాజీ దంపతులు పెద్దమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు పూర్ణకుభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వనం ఇచ్చి అమ్మవారి శేష వస్త్ర ప్రసాదములను అందజేశారు.

## శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, తిరువాయిముజి సేవాకాలం, విష్ణుస హస్ర నామపారాయణం, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ఉత్సవ కమిటీ కి దేవాదాయ శాఖ అధికారిణి సమత వారి నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతన ఉత్సవ కమిటీ ఆలయంలో ప్రత్యేక పూజలు న్విహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకోటేశ్వరరావు, అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపీ కృష్ణమాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యండపల్లి శ్రీనివాసరావు, కొమ్మిన్ని రామారావు, పెద్దగౌండ్ల వెంకటనారాయణ, కొడవకంటి రాంబాబు, తూము భిక్షం, పగిడిపల్లి నవత, బండి తిరపయ్య , గ్రామస్థులు దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, జలగనబోయిన కృష్ణ, పోట్ల నర్సింహారావు, ఆలయ సిబ్బంది నాగరాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ పంట లాభదాయకం

**- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవి.మధుసూదన్**



ప్రజాపక్షం/బోనకల్ : బోనకల్ మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, ఆయిల్‌పామ్ పంట లాభదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవి. మధుసూదన్ తెలిపారు. శుక్రవారం బోనకల్ మండలం గోవిందాపురం, నారాయణపురం గ్రామాల్లో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలు, ప్రభుత్వ పోత్సాహక పథకాలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలపై వివరించారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, గెలల కోత సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. రైతులు ఆయిల్ పామ్ సాగుతో పాటు కూరగాయ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్ పామ్, కూరగాయ, సెరికల్చర్ పంటల సాగు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నెటఫిమ్ డ్రిప్ అగ్రోనమిస్ట్ సుబ్బారావు, ఈ కార్యక్రమంలో ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

**-హాజరైన ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు**





ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవాలయం(శివాలయం)లో నిర్వహించిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం ఆధ్యాత్మిక వైభవంతో, భక్తుల హర్షధ్వానాలతో ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభ పునఃప్రతిష్ట, బలిపీఠ ప్రతిష్ట, అలాగే లక్ష్మీ గణపతి, బాల త్రిపుర సుందరి దేవతల ప్రతిష్ట కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు హాజరై స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంత ప్రజల సుఖ శాంతి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్య సమృద్ధి కోసం వేడుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఆలయాలు గ్రామీణ జీవనానికి ఆధ్యాత్మిక ఆధారస్తంభాలుగా నిలుస్తాయని, భక్తిభావం సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సత్సంకల్పాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రజలు, భక్తులు సహకరించాలన్నారు. ఈ మహోత్సవంతో బూర్గంపాడు గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తుల తాకిడి, మంగళ వాద్యాలు, వేదఘోషల మధ్య దేవాలయ ప్రాంతం పుణ్యక్షేత్ర వాతావరణాన్ని సంతరించుకుంది. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ దుద్దుకూరి మురళి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, బూర్గంపాడు ఉప సర్పంచ్ గుండె వెంకన్న, సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు భజన ప్రసాద్ కుమార్, ఇంగువ రమేష్, సూర్య ప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాలను ఆదర్శవంతమైన పంచాయతీలుగా తీర్చిదిద్దుకోవాలి

**-పంచాయతీ రాజ్ అడిషనల్ కమిషనర్ మధులత**



ప్రజాపక్షం/కారేపల్లి: గ్రామ పంచాయితీలే అభివృద్ధికి పట్టుకొమ్మలని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాలను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పంచాయితీలుగా తీర్చిదిద్దాలని పంచాయితీ రాజ్ అడిషనల్ కమిషనర్ మధులత పిలుపునిచ్చారు. నగరంలోని డీపీఆర్సీ సెంటర్‌లో సింగరేణి మండలానికి చెందిన 41 గ్రామ పంచాయితీల సర్పంచులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులకు ఆమె స్వయంగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచులతో ముఖాముఖి మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రతి రోజూ పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచులు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అన్నది నిరంతరం పరిశీలించాలని చెప్పారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జవాబుదారీతనంతో పారదర్శక పాలన అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచులు పాల్గొన్నారు.

# సిపిఎంకి కొండపల్లి శ్రీధర్ రాజీనామా

**- జిల్లాలో మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించాలి**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ, కొత్తగూడెం జంట నగరాలలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి మూతపడిన ఎన్ఎండిసి, ఏపి స్టీల్ ప్లాంట్ పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని సీనియర్ నాయకులు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. జిల్లా డెవలప్‌మెంట్ ఫోర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని అంతర్గత కారణాలు, అనివార్య పరిస్థితుల్లో సిపిఎం పార్టీ సభ్యత్వానికి, జిల్లా కమిటీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. కొత్తగూడెం, పాల్వంచలో వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వనరులు పుష్కలంగా ఉన్న జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఎరువుల పరిశ్రమలు, సిమెంట్ ఫ్యాక్టరి, థర్మల్ పవర్ ప్లాంట్, వ్యవసాయాధారిత మిర్చి, పత్తి పంటలు పుష్కలంగా ఉన్నాయన్నారు. దీనితో వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ సమస్య రోజు రోజు పెరుగున్నదని దీనిని నియంత్రించటానికి బైపాస్ రహదారి త్వరగా నిర్మించాలన్నారు. రైతులు పండించే పంటలు గిట్టుబాటు ధర కల్పించాలని వీటి సాధనకై భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజల సహకారంతో ఉద్యమాలు నిర్వహిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి పూనుకుంటానని చెప్పారు. అనివార్య కారణాలతో సిపిఎం పార్టీ సభ్యత్వానికి, జిల్లా కమిటీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# విజయశ్రీ సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా విజయశ్రీ విద్యాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని మండల విద్యాశాఖాధికారి బి. రాములు తెలిపారు. మండల పరిధిలోని గణేశ్వరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న కొట్టె విజయశ్రీ శనివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో శైలజ, రఘునాథపాలెం ఎంఈవో రాములు మాట్లాడుతూ 36 ఏళ్లుగా వివిధ ప్రాంతాలలో పనిచేసి ఎందరో విద్యార్థులను విజయశ్రీ ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. విజయశ్రీ భర్త సుదర్శన్ ఉపాధ్యాయ వృత్తిలోనే ఉద్యోగ విరమణ చేసి మరణించారన్నారు. వారిరువురు విద్యాభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. విజయశ్రీ ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయశ్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, ఎపిపిసి చైర్మన్ సుశీల, పిఆర్‌టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు కృష్ణమోహన్, పిఆర్‌టియు మాజీ జిల్లా అధ్యక్షులు మోత్కూరి మధు, జిల్లా అధ్యక్షులు కె. శేఖర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. నాగేశ్వరరావు, ఎస్‌టిఎఫ్ బాధ్యులు డి. సైదులు, రిటైర్డ్ ఎంఈవో దాసు, రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్‌కె రఫీక్ పాషా, లేడిబోయిన గోపాలరావు, మజార్, ఎన్. వెంకటేశ్వరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తికి వన్నెతెచ్చిన రామలింగారెడ్డి

**-ప్రశంసలే తప్ప విమర్శలు లేని 42 ఏళ్ల ఉద్యోగ జీవితం**





ప్రజాపక్షం/ ఖమ్మం : దశాబ్దాల ఉద్యోగ జీవితంలో ఎంత జాగ్రత్తగా ఉన్న ఆరోపణలు రావడం సహజం. అది పోలీస్ వృత్తిలో పలు విమర్శలు ఎదుర్కొనక తప్పదు. కానీ 42 ఏళ్ల పోలీస్ ఉద్యోగంలో ప్రశంసలే తప్ప విమర్శలు, ఆరోపణలు లేని జీవితం ఆయనది. సాధారణ కానిస్టేబుల్‌గా జీవితం ప్రారంభించి ఎస్ఐగా పదవి విరమణ చేస్తున్న రామలింగారెడ్డి తన సుదీర్ఘ ప్రస్థానంలో బాధితులకు భరోసానివ్వడం, నిందితులను చట్ట ప్రకారం శిక్షించడం మాత్రమే ఆయనకు తెలుసు. ఇప్పటి ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పుట్టకోటలో జన్మించిన మరెడ్డి రామలింగారెడ్డి తన ప్రాథమిక విద్యను పుట్టకోటలోనూ ఆ తర్వాత ఖమ్మం నగరంలోని నయాబజార్ ఉన్నత పాఠశాల, శాంతినగర్ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎస్ఆర్అండ్‌బిజిఎన్ కళాశాలలో డిగ్రీని పూర్తి చేశారు. 1984 అక్టోబర్ 8న పోలీస్ ఉద్యోగంలో ప్రవేశించిన ఆయన మొట్టమొదట చర్ల పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు. చర్ల, మణుగూరు, కొత్తగూడెం లోని రామవరం, చింతూరు, ఇల్లందు, కుక్కునూరు, ఖమ్మం, విఆర్‌పురం పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. ఖమ్మం త్రీటౌన్‌లో పనిచేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఖమ్మం వన్‌టౌన్‌లో పనిచేస్తూ ఏఎస్ఐగా ప్రమోషన్ పొందిన ఆయన కూసుమంచిలో ఎఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా పదోన్నతి పొంది ప్రస్తుతం తిరుమలాయపాలెంలో పనిచేస్తూ ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ జీవితంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ఉన్నతాధికారులు అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయడం ద్వారా రామలింగారెడ్డి పలుమార్లు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ కాలం పనిచేసిన రామలింగారెడ్డి గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడటం, స్థానిక సమస్యలను స్థానికులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించడం, అవాంఛనీయ ఘటనలుజరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో సిద్ధహస్తుడిగా పేరొందారు. వేసుకున్నది ఖాకీ బట్టలే అయినా ఆ కరుకుతనాన్ని ఏనాడు చూపించని మానవతావాదిగా రామలింగారెడ్డి పేరొందారు. స్నేహితునిగా, సహచరునిగా రామలింగారెడ్డికి ఎందరో ప్రీతిపాత్రులున్నారు. ఆప్యాయంగా పలకరించి కష్ట సమయాల్లో ఆపన్నహస్తం అందించే రామలింగారెడ్డి శేషజీవితం సుఖ సంతోషాలతో గడపాలని, ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో సహచరిణి నళిని ఎంతోగానో సహకరించింది. ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు కుమారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఆమె పాత్ర ప్రశంసనీయం. ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవలో గడుపుతూ ప్రజలకు సాయం అందించే తత్వాన్ని కొనసాగించాలని ఆకాంక్షిద్దాం.

# ఎఐటియుసితోనే కార్మిక హక్కులకు రక్షణ



ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఏఐటియూసితోనే కార్మిక హక్కుల రక్షణ సాధ్యమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఏఐటియూసి అనుబంధం) బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా వర్క్ షాపులో గేట్ మీటింగ్ జరిగింది. పిట్ కార్యదర్శి మధు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గట్టయ్య మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చలు జరిపి అనేక హక్కులు సాధించినట్లు తెలిపారు. ట్రేడ్స్ మెన్‌లు, మైనింగ్ స్టాఫ్ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో వారిని జనరల్ మజ్దూర్‌లుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి వారికి ఆర్థిక నష్టం వాటిల్లకుండా వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సూటబుల్ జాబ్స్ ఇచ్చేందుకు కృషి చేసామని చెప్పారు. అనారోగ్య కారణాల వల్ల వెల్డర్‌గా మెడికల్ అన్‌ఫిట్ అయిన జరల్ మజ్దూర్ జన్సన్ అనే కార్మికునికి తిరిగి విధుల్లోకి వెళ్లే విధంగా చేసిన ఘనత తమ యూనియన్‌ది అన్నారు. అనంతరం ఆఫీస్ బేరర్ సందెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని, అధికారం ఉన్నా లేకున్నా కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసేది ఏఐటియూసి అని చెప్పారు. ఏరియా వర్క్ షాపులో క్లర్క్‌ల ఖాళీలను భర్తీ చేయాలని, వేసవి కాలం కార్మికులు వడ దెబ్బకు గురికాకుండా మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని, సెక్షన్లలో కూలర్లు ఏర్పాటు చేయాలని, అన్‌ఫిట్ కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. అనంతరం వర్క్‌షాపు డిజిఎం క్రిష్టాఫర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిజిఎం సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి వీరయ్య, రాజ్ కుమార్, గుమ్మడి మురళీ, కరుణాకర్, మెంగ నిరోషన్, సత్యనారాయణ, సముద్రాల శ్రీనివాస్, జాన్సన్, జివిఎల్ శ్రీనివాస్, హరీష్, కళ్యాణ్, కిరణ్‌కుమార్, సలిగంటి శ్రీనివాస్, రాజయ్య, బాలరాజు, కస్తూరి రమేష్, అశోక్, వెంకట స్వామి, నరేందర్, రాజు, రమేష్, చంద్రశేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ నిర్మాణంలో డొల్లతనం..!

**-11లక్షల ప్రజాధనం వృథా**
**-గుత్తేదారు నిర్లక్ష్యపు సమాధానం**
**-చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**





ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని చింతిర్యాల గ్రామ పంచాయితీ పరిధిలోని కట్టంవారిగూడెంలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనం పనులపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ 11లక్షల వ్యయంతో మంజూరు చేసిన ఈ నూతన భవనం నిర్మాణ దశలోనే నాణ్యత లోపాలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. అంగన్వాడీ నిర్మాణం మొత్తం 9 పిల్లర్లతో నిర్మాణం జరగాల్సి ఉండగా అందులో 6 పిల్లర్లు మాత్రమే సరైన అడుగు మందంతో నిర్మించగా, మిలిగిన 3 పిల్లర్లు కేవలం 9 అంగుళాల మందంతోనే నిర్మించారని ఆరోపిస్తున్నారు. మ్యాప్‌లో ఉన్న కొలతల ప్రకారమే చేశామని కాంట్రాక్టర్ సమాధానం ఇస్తున్నప్పటికీ, స్థలంలో కనిపిస్తున్న పరిస్థితి భిన్నంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. నిర్మాణంలో ముఖ్యమైన వాటర్ కిరింగ్ పద్ధతిని సరైన విధంగా పాటించలేదని, కొన్ని రోజులు పూర్తిగా నీటిపారుదల లేకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా సన్ సైడ్‌లు నిర్మాణ దశలోనే బీటలు విడిచి ఒక వైపు కూలిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. మిగిలిన భాగాలు కూడా ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు. నాణ్యతపై ప్రశ్నించిన గ్రామస్తులకు గుత్తేదారు మీకు అడగడానికి అర్హత ఏమిటి ఎవరికి మీరు చెప్పుకున్న భయపడేది లేదు అంటూ తిరస్కార ధోరణితో సమాధానం ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మా వాళ్లు అధికారం మాది అన్నట్టు వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన అంగన్వాడీ కేంద్రం చిన్నారుల కోసం నిర్మించబడుతున్న భవనం కావడంతో, నిర్మాణ నాణ్యతలో నిర్లక్ష్యం ప్రాణహానికి దారితీయొచ్చని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి భవన నిర్మాణంలో లోపాలను గుర్తించి గుత్తేదారు కాంట్రాక్ట్‌ను రద్దు చేసి భవనాన్ని మరలా పునర్ నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రానగర్ అయ్యప్పస్వామి ఆలయం వెనుక శ్రీజగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ భూమి పూజ శంకుస్థాపన పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ దంపతులు, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు దంపతులు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా నాయకులు పొదిల హరినాథ్, పమ్మి అశోక్, వుంద్రు శ్యామ్‌బాబు, వీరంశెట్టి సీతారాములు, పల్లపు కొండలు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, కంభంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గొల్లపూడి గ్రామంలో దొబ్బల వేణు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహాన్ని, గొల్లపూడి గ్రామ సర్పంచ్ మేడూరు రామారావు, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామారావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని, అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. దొబ్బల వేణు కుటుంబ సభ్యులు తమ సొంతింటి కల నెరవేరినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామ సర్పంచ్‌కి, ప్రభుత్వానికి కృతజ్ఞులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రేస్ అధ్యక్షులు షేక్ సైదా, దాసాంజనేయు స్వామి దేవాలయ చైర్మన్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి సతీష్, పెండ్యాల కోటేశ్వరరావు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్స్ ట్రైనింగ్ పూర్తి



ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలోని గారమపంచాయతీల వార్డు మెంబర్స్‌కు వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న రైతువేదిక నందు గత ఐదు రోజులుగా ప్రభుత్వం నిర్మించిన వార్డు మెంబర్స్ ట్రైనింగ్ శుక్రవారం పూర్తయింది. వార్డు మెంబర్స్‌కి ట్రైనింగ్ సర్టిఫికెట్స్ ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సభ్యులు ట్రైనింగ్‌లో నేర్చుకున్న ప్రతి విషయాన్ని పంచాయతీ అభివృద్ధికి తోడ్పడే విధంగా వారు తెలిపారు.

## ఆలయానికి గోదానం



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ గుడిపాడు గ్రామంలోని కాకతీయుల నాటి అతి పురాతనమైన శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి ఆలయ పున ప్రతిష్ట సంధర్భంగా ఆలయ గోశాలకు బంజారా సంఘాల ఆధ్వర్యంలో గోవును సమర్పించారు. సంఘం వైస్ చైర్మన్ బానోత్ వీరునాయక్, రమేష్ రాథోడ్, గణేష్ మహారాజ్ , బాబూలాల్ నాయక్, బాలక్రిష్ణ, కేశవ్ నాయక్, కాన్షీరాం నాయక్, గుగులోత్ భద్రులు భాజా భజంత్రీలతో భారీ ఊరేగింపుతో వెళ్ళి ఆలయ పునప్రతిష్ఠ దాత శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్ రెడ్డికి అందజేశారు. ఈ సంధర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంతో పాటు హాతీరాం, శ్రీబాలాజీ పాచికలు ఆడిన విగ్రహంతో పాటు మంచి ఆశ్రమం నెలకొల్పుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ సాధువులు గణేష్ మహారాజ్,భాద్యా సోదువు, బాలు సాధువు, రమేష్ సాధువు, శంకర్ సాధువు ంఫల్ సాధువు తదితరులు పాల్గొన్నారు.

## యువత జాతీయ క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/పాల్వంచ: యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.మండల పరిధి నారాయణరావు పేట గ్రామంలో సంతోష్ కుమార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యర్రపోతు పుల్లయ్య మెమోరియల్ కప్ మండల స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. అదే విధంగా చదువు, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఎందరో క్రీడాకారులు అత్యుత్తమంగా రాణించి దేశ, ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకొన్నారని, ఉజ్వల భవిష్యత్‌ను చేరుకొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు ఉప సర్పంచ్ యర్రపోతు సంతోష్‌కుమార్, నాగారం, దంతెలబోర ఎస్‌సి కాలని సర్పంచ్‌లు స్వప్న, వెంకటరమణ, నాయకులు జాలె జానకిరెడ్డి, ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్నగౌడ్, వై. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూములు నిరుపేదలకే దక్కాలి



-విధ్వంసకర చర్యలు సరికాదు
-మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంజిల్లాలోని వెలుగు మట్ల భూదాన్ భూములు నిరుపేదలకే దక్కాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా పేదలు అక్కడ ఇండ్లు నిర్మించుకుని జీవిస్తుంటే సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వమే సౌకర్యాలు కల్పించకపోగా గుడిసెలు కూల్చివేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సమావేశం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రంగారావు మాట్లాడుతూ పేదలకు ఇండ్లు ఇస్తామని ఎన్నికల నాడు హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఉన్న ఇండ్లను కూల్చివేసిందన్నారు. నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చివేయడం దుర్మార్గ చర్యగా ఆయన అభివర్ణించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదల జీవితాన్ని అధికార యంత్రాంగం బుగ్గిపాలు చేసిందని, వీధినపడిన పేదలకు తక్షణం పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ విధ్వంసకర చర్యలకు పాల్పడుతుందని ఆయన తెలిపారు. పునరావాసం కల్పించాలని నిజమైన బాధితుల జాబితా తయారు చేసి వారికి తిరిగి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, గుగ్గిం అచ్చయ్య, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, కొల్లేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కొత్తూరు 2 అంగన్ వాడీ కేంద్రంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విశ్రాంత సిడిపివోలు ఉషారాణి, ఉదయశ్రీ, శివమ్మ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. సమతుల్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాలకు అవసరమైన వసతులు కల్పనతో పాటు గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ వాసిరెడ్డి శ్రీ వెంకటనాగమణి, అంగన్‌వాడీ ఆయా సీతమ్మ, స్వతంత్ర భారతి, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# 'తొలి వెలుగు' రఘుపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు, యూట్యూబ్ ఛానెల్ తొలివెలుగు రఘుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. 40 ఏళ్లుగా రాష్ట్రం, జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జీవితం తెరిచిన పుస్తకం అని నాయకులు తెలిపారు. నిరంతరం అభివృద్ధి గురించి ఆలోచించే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై రఘు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. రఘుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, సర్పంచ్‌లు కాపా ఆదినారాయణ, గాజుల కృష్ణారావు, కోటేరు నర్సిరెడ్డి, షేక్ సిద్దిఖ్, ఉప సర్పంచ్‌లు బండి వెంకన్న, మాధం శెట్టి హన్మంతరావు, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, లక్ష్మణ్ గౌడ్, చెరుకూరి పూర్ణచందర్‌రావు, కిలారు వెంకట రమణ, బాతుల సుధాకర్, భూక్యా లాలు, రెంట్యాల ప్రసాద్, రామ్మూర్తి, శ్రీనివాసరావు, ఊయ్యూరు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నమండవలో చెక్‌పోస్ట్



ప్రజాపక్షం/చింతకాని : చిన్నమండవ మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీస్ , రెవెన్యూ సమన్వయంతో చిన్నమండవ గ్రామంలో చింతకాని ఎస్సై వీరేందర్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. గ్రామస్తులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు, జీపీవో ఉప్పలయ్య పాల్గొన్నారు.

# రాఘవాపురంలో ఫ్రైడే డ్రైడే



ప్రజాపక్షం/చింతకాని : రాఘవాపురం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ కాంపల్లి కోటమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే గ్రామంలో ప్లాస్టిక్ నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సైడ్ డ్రైన్‌లలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్ , వార్డు సభ్యులు దొబ్బల నర్సింహారావు, వడ్లమాని రాంబాబు, సింగారపు నాగమ్మ, వడ్డె నిరోషా, పంచాయతీ సిబ్బంది కొల్లి కొండయ్య, నల్గొండ కార్తీక్, ఆశా కార్యకర్తలు అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్య శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీ





ప్రజాపక్షం/వైరా: వైరా మత్స్యశాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలోరికార్డులు తనిఖీలు చేశారు. ఉదయం ఆఫీస్ విధులు కంటే ముందుగానే వైరా కార్యాలయానికి అవినీతి నిరోధక శాఖ అధికారులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైరా మత్స్యశాఖ పరిధిలోని 10 మండలాల్లో ఉన్న 55 చేపల సొసైటీలకు సంబంధించి ప్రతి ఫైలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనంతరం ఏసిపి డిఎస్పీ మాట్లాడుతూ వైరా మత్స్యశాఖ కార్యాలయంలో పనితీరు సక్రమంగా లేదని, సిబ్బంది ఉండటం లేదని ఫిర్యాదు అందడం జరిగింది. ఆ ఫిర్యాదు మేరకు వైరా మత్స్యశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్నామని, రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని,మ త్స్యశాఖ పరిధిలో మత్స్య కార్మికులకు కల్పించాల్సిన అవేర్‌నెస్ కార్యక్రమాలు సక్రమంగా లేవని, ప్రతిదీ నిర్లక్ష్యంగా కనిపించిందని అన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో రికార్డులు పరిరక్షణ కొనసాగుతుందని, అన్ని రికార్డులు తెప్పించడం జరిగిందని అన్నారు. ఖమ్మం కార్యాలయం నుంచి కూడా రికార్డులను వైరా తీసుకొచ్చారు. 2022 ఫిబ్రవరిలో అప్పుడు ఇంచార్జి మత్స్యశాఖ అధికారిగా ఉన్న చిట్టిబాబును మరో వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరగకపోయినా పనితీరు సక్రమంగా లేకపోయినా ప్రజలకు ఇబ్బంది కలిగిన అవినీతికి పాల్పడుతున్న, లంచం అడిగిన 1064కు ఫిర్యాదు చేయండి, లేదా 9154388981 అనే నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని, ఫిర్యాదుదారుని వివరాలు గోప్యం ఉంచడం జరుగుతుందని తెలిపారు. లంచం అడగడం ఒక నేరం, లంచం ఎవరైనా అడిగినా మీరు ధైర్యంగా నిలదీయండి, లేదా అవినీతి నిరోధయ శాఖకు సమాచారం అందించండి అని డీఎస్పీ రమేష్ తెలిపారు.

# 12వ వార్డులో డ్రైనేజీ పూడికతీత పనులు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ శుక్రవారం మున్సిపాల్ సిబ్బందితో మాట్లాడి కార్మికులతో డ్రైనేజీలో పూడిక తీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత వార్డులో మున్సిపాల్ కార్మికులతో పాటు ఉండి డ్రైనేజీను తానే దగ్గరుండి పూడికలను తీపించడం జరిగింది. అనంతరం మాదినేని సునీత మాట్లాడుతూ వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలు నమ్మకాన్ని తప్పకుండా పాటిస్తానని అభివృద్ధి పథంలో ఉండేవిధంగా చూస్తానని, వార్డులో పారిశుద్ధ్య లోపం లేకుండా ఉండేందుకు తనవంతు పూర్తిస్థాయిలో ప్రయత్నం చేస్తానని తెలిపారు. అదేవిధంగా ప్రజలు డ్రైనేజీల్లో వ్యర్థపదార్థాలు పడవేయకుండా మున్సిపాలిటీ చెత్త వాహనాల్లోనే వేయాలని ఆమె సూచించారు. చెత్త వాహనాలు వార్డుల్లో రానప్పుడు తనకు సమాచారం అందించాలని సునీత తెలిపారు.

# మార్చి 2న వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం

- దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సహజ సిద్ధంగా ఏర్పాట్లు



ప్రజాపక్షం/ మధిర : మండల పరిధిలోని మహాదేవపురం గ్రామంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని మార్చి 2న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పండితులచే అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు మహాదేవపురం గ్రామం, చుట్టుపక్కల గ్రామాల నుండి భారీగా భక్తులు హాజరవుతారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేటి నుండి మార్చి 2వతేదీ వరకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. 2వ తేదీన ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామి వారి అష్టోత్తర శతకలసస్నాపనం తదనంతరం స్వామి వారికి తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, భక్తుల అధిక సంఖ్యలో హాజరై స్వామి కళ్యాణాన్ని తిలకించి పుణ్యాతులు కావాలని కోరారు. గత సంవత్సరం కళ్యాణ మహోత్సవం సందర్భంగా వ్యవసాయ రైతులు పండించిన ధాన్యంతో భక్తులకు భోజన వసతి కల్పించటం జరిగిందని, 2వ తేదీన జరిగే స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సహజ సిద్ధంగా ఆవు పేడతో స్టేజి అలంకరణ, ముగ్గుతో వెంకటేశ్వరస్వామి చిత్రం అలంకారంతో పాటు అన్నదాన కార్యక్రమంలోభాగంగా పర్యావరణానికి ఎటువంటి ముప్పు కలగకుండా ఉండేందుకు మట్టి గ్లాసులతో మంచినీరు అందిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది.



# ప్రార్థనలో పాల్గొన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 9వ వార్డులో శుక్రవారం ఇందిరమ్మ కాలనీ వైరాలో జరిగిన ప్రార్థనా కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ, మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ వైరా పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. పట్టణంలో మౌళిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, త్రాగునీరు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఆర్థిక సహాయం అందించారు. వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ చర్చి ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మున్సిపాల్ పాలకవర్గం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పొదిల హరినాథ్, వుండ్రు శ్యామ్‌బాబు, పల్లపు కొండలు, పుల్లయ్య, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, చర్చి ఫాదర్లు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం కార్పొరేషన్‌కు పాల్వంచ పేరు చేర్చాలి

**- ముఖ్యమంత్రికి కూనంనేని లేఖ**
**- పాల్వంచ పూర్వ వైభవం,ప్రజా ఆకాంక్షల మేరకే డిమాండ్**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరుని కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చాలని కోరుతూ కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను విలీనం చేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నూతన కార్పోరేషన్‌కు కేవలం కొత్తగూడెం పేరు మాత్రమే ఉందని, దీనిలో పాల్వంచ పేరు కూడా చేర్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారని, వారి మనోభావాలన గౌరవిస్తూ పేరు మార్చాలని ఎంఎల్‌ఏ కోరారు. పాల్వంచకు ఘనమైన చరిత్ర ఉందని, గతంలో ఇది ఒక సంస్థానంగా, ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా విరాజిల్లిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాల్వచ పేరును కార్పోరేషన్‌లో చేర్చడం ద్వారా ఈప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడినట్లు అవుతుందని కూనంనేని పేర్కొన్నారు. పేరు మార్పు విషయంలో పాల్వంచ ప్రజల కోరిక అత్యంత సమంజసం అని, ప్రభుత్వం సానకూలంగా స్పందించి అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరితగతిన కొత్తగూడెంపాల్వంచ మున్సిపల్ కార్పోరేషన్‌గా అధికారిక ప్రకటన వెలువడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతూ పంపిన లేఖలో కూనంనేని పేర్కొన్నారు.

### సజావుగా సాగుతున్న ఇంటర్ పరీక్షలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఇంటర్ మీడియట్ పరీక్షలు జిలాల్లో ప్రశాంతంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ప్రథమ సం. ఆంగ్ల పరీక్షకు 37 కేంద్రాల్లో మొత్తంగా 442 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశ్నాపత్రాల పంపిణి, పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# పాములేరు వాగులో ఇసుక అక్రమ తవ్వకాలు

**-అధికారులపై సోషల్ మీడియాలో యువత ప్రశ్నలు**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని కంపగూడెం క్రాస్ రోడ్ సమీపంలోని ఎర్రమ్మ గుడి ప్రాంతంలో ఉన్న పాములేరు వాగు నుండి ఇసుకను లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఇసుకను చంద్రుగొండ మండలం వైపు తరలిస్తున్నట్లు స్థానిక యువత సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. గురువారం రాత్రి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతూ యువత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మండలంలో అధికారులు ఉన్నారా..లేక అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారా అంటూ ప్రశ్నలు సంబంధించారు. యువత హడావుడి చేయడంలో ఇసుక లోడ్ చేసిన ఒక లారీ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. సంబంధిత సోషల్ మీడియా గ్రూప్‌లో స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నప్పటికీ తక్షణ చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయట ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలింపులపై అధికారులు మౌనం వహిస్తుండగా, స్థానిక అవసరాలకు ఇసుక తరలించినప్పుడు మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటున్నారంటూ ద్వంద్వ వైఖరిపై విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక కారణంగా స్థానికంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలకు ఇసుక కొరత ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతోందని వారు పేర్కొంటున్నారు. వాగులనను కాపాడేందుకు తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

### దృష్టి రాలేదు....తహసీల్దార్ బండి భాగ్యలక్ష్మీ

ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ బండి భాగ్యలక్ష్మీ ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, శనివారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఘటన మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# బదిలీ పంచాయతీ కార్యదర్శులకు ఘన సన్మానం

**-317 జీఓ బదిలీలతో సొంత జిల్లాలకు పయనం**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా గ్రామ పంచాయితీల అభివృద్ధికి విశేషంగా సేవలందించిన అశ్వాపురం గ్రామ పంచాయితీ కార్యదర్శి మల్లేశం, మొండికుంట గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ 317 జీవో ప్రకారం బదిలీపై తమ సొంత జిల్లాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో అశ్వాపురం ఎంపీడీవో ముత్యాలరావు, యూడీసీ పద్మావతి, మండల పంచాయితీ కార్యదర్శుల సమక్షంలో వారికి ఘనంగా సన్మానం చేశారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈసందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, త్రాగునీటి సదుపాయాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక అంశాల్లో వారు నిబద్ధతతో పని చేశారని వారి సేవలు ఎల్లప్పుడూ గుర్తిండిపోతాయని అన్నారు. ఈసందర్భంగా పంచాయితీ కార్యదర్శులు మల్లేశం, ప్రవీణ్ మాట్లాడుతూ అశ్వాపురం మండల ప్రజల సహకారం వల్లే తాము సమర్థంగా పని చేయగలిగామని, మేము నిర్వర్తించిన ఉద్యోగ బాధ్యతలకు అధికారులకు సహోద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా చేస్తున్న ఉద్యోగ బాధ్యతలలో నిబద్ధతతో కొనసాగుతామని చెప్పారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయితీల కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంఎల్‌ఏ కోరం





**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని రామలింగేశ్వర స్వామి(శివాలయం)లో ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించే శివాలయం జాతరకు ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఏ కోరం కనకయ్య దంపతులు విచ్చేయగా, కమిటీ సభ్యులు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్‌ఏ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జాతరను నిర్వహించడం అభినందనీయమని స్వామి వారి కళ్యాణమును ఎటువంటి ఘర్షణ వాతావరణం లేకుండా వైభవంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ డి అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, నాయకులు హనుమంతరావు, మద్దిన్ని రమేష్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, దొడ్డా వేణు, ఎస్‌కె పత్తే అహ్మద్, తోటకూరి శివయ్య, భద్రయ్య, శబరినాథ్, జన్నారపు లింగయ్య, నల్లమోతు వెంకట నరసయ్య, పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు, బత్తుల నాగరాజు, దేవేండ్ల రామకృష్ణ, ఆలోత్ శివ, అంబడిపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థికసాయం




**ప్రజాపక్షం/భద్రాచలం :** రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న యువకుడు లక్కోజు ప్రసాద్‌కు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ మేరకు రూ.7 వేల చెక్కును బాధితుని మిత్రునికి ఏఎస్‌పి విక్రాంత్ సింగ్ కమార్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అనంతరం ఏఎస్‌పి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని చాటుతాయని చెప్పారు. ఫౌండేషన్ బాధ్యులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎలాంటి సహాయ సహకారాలు లేని లక్కోజు ప్రసాద్‌ను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. వైద్య ఖర్చులు మరింత ఎక్కువగా ఉంటే మరికొద్ది ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వస్తామన్నారు. బాధితునికి సహాయం చేయ దలుచుకున్న దాతలు 9989549634 ఫోన్ పై నెంబర్‌కు సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు, చేతన మీసేవా నిర్వాహకులు రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఐటిడిఏ ప్రాంగణంలోని వైటిసిలో డేటా ఎంట్రి, డ్రోన్ సర్వీస్, ఎలక్ట్రీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు తన ఛాంబర్లో సర్టిఫికెట్లును అందజేశారు. అనంతరం పిఓ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని, డ్రోన్ ద్వారా వ్యవసాయానికి ఉపయుక్తంగా మార్చుకోవాలన్నారు. డేటా ఎంట్రి, డ్రోన్ శిక్షణ తీసుకున్న వారికి భువనగిరి, హైదరాబాద్, గుంటూరు వంటి ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థలు పదిహేను నెలల పాటు ఉచిత భోజనం వసతి అందిస్తూ పదిహేను మంది యువతీయువకులకు ఉద్యోగ అవకాశాన్ని కల్పించడం అభినందనీయం అన్నారు. రానున్న రోజుల్లో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఏడిఎంహెచ్‌ఓ సైదులు, ఏఓ సున్నం రాంబాబు, జేడిఎం హరికృష్ణ, డేటా ప్రో కంప్యూటర్ మేనేజర్ గోపీనాథ్, ఐటి ట్రైనర్ సలోచన, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ అరుణ, మొబలైజర్ రాహుల్, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



**ప్రజాపక్షం/కామేపల్లి:** ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఈ వృత్తి ద్వారానే ఎందరినో ప్రయోజకులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొమ్మినేపల్లి ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు యం నర్సింహారావు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 30 సంవత్సరాలకు పైగా సర్వీస్ చేసి రిటైర్‌మెంట్ అయిన తరువాత బెనిఫిట్స్ చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నర్సింహారావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డిసిఈబీ సెక్రటరీ కె వెంకటేశ్వర్లు, యుటియఫ్ జిల్లా నాయకులు రాందాస్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు జివి నాగమాలేశ్వరరావు, పూర్వ జిల్లా కార్యదర్శి యన్ వీరబాబు, శేషయ్య, జె వెంకటేశ్వర్లు, జి వెంకటేశ్వర్లు, డియస్ఓఆర్ శ్రీనివాసరావు, బి రవికుమార్, శ్రీనివాసరెడ్డి, జే రమాప్రభ, అరుణ, జ్యోతి భవాని, యన్ శ్రీనివాసరావు, పి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/అశ్వాపురం:** రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం అశ్వాపురం మండల బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి వరి నాట్లు పూర్తి అయి నెలలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు అనంతరం రైతుబంధు ఇస్తామని హడావిడిగా ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు మాట నిలబెట్టుకోలేదన్నారు. మొదట డిసెంబర్ ఆపై సంక్రాంతి ఇప్పుడు మార్చి అంటూ రైతు బంధును వాయిదా వేస్తూ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. రైతు బంధు చెల్లించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పంచాయితీ ఎన్నికల్లో రైతుల ఓట్ల కోసం ఒక సారి మాత్రమే రైతుబంధు ఇచ్చి ఆ తర్వాత సహకార ఎన్నికలకు కూడా రద్దు చేయడం వెనుక రైతుబంధు ఇవ్వాలనే ఉద్దేశం లేదనే ఆరోపించారు. రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని అన్నారు.

# హార్డ్ వేర్ షాపు ప్రారంభం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలో శ్రీనివాస ఐరన్ మరియు హార్డ్ వేర్ నూతన షాపునను ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రొప్రైటర్ బొజ్జ నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ముత్తినేని వాసు, కోర్లకుంట కోటేశ్వరరావు, వలబోజు మురళీకృష్ణ, మండేపూడి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే తొలి ఇందిరమ్మ-రేవంత్ రెడ్డి కాలనీ ప్రారంభం



## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం, నూతన సిసి రోడ్లు, సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/సత్తుపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేరు మీద రాష్ట్రంలోనే తొలి కాలనీ సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయంగా నిలిచే ఈ కార్యక్రమం సత్తుపల్లి మండలం, కొత్తూరు గ్రామంలో శుక్రవారం వైభవంగా జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన గృహ సముదాయానికి "ఇందిరమ్మ రేవంత్ రెడ్డి కాలనీ"గా నామకరణం చేస్తూ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలోకి ఘనంగా ప్రవేశించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి పేరు మీద కాలనీకి నామకరణం చేయడం రాష్ట్రంలో ఇదే తొలి సారన్నారు. ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ కూడా కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తూరు గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి అత్యాధునిక వసతులతో కాలనీని నిర్మించినట్లు పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇదే విధానాన్ని అమలు చేయనున్నట్లు నాయకులు వెల్లడించారు. అనంతరం మోడల్ కాలనీలో సీసీ కెమెరాలు, నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొర్ల రామ్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, చల్లగుళ్ళ నరసింహారావు, కొప్పుల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌తోనే సమాజ ప్రగతి : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సత్తుపల్లి: సైన్స్ తోనే సమాజ ప్రగతి ఆధారపడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం ( ఫిబ్రవరి 28) పురస్కరించుకొని విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు శుక్రవారం నాటితో ముగిశాయి. ముగింపులో భాగంగా విద్యార్థులు రూపొందించిన సుమారు 200 రకాల అంశాలను సైన్స్ ఎక్స్ పోలో ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రయోగాల ద్వారా నేర్చుకోవడం వలన విద్యార్థుల్లో అవగాహన శక్తి, తెలుసుకోవాలనే కోరిక, సైన్స్ పట్ల ఆసక్తి, ప్రాజెక్టు చేయగలనన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచె ఒక లక్ష్యం ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా బేగం కమల్, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత మాట్లాడుతూ మానవ మనుగడ సైన్స్ తోనే ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి సైన్స్ పట్ల అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, వార్డ్ కౌన్సిలర్ అపర్ణ తదితరులు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, అవినాష్ ఉపాధ్యా యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాఠ్యాంశం తొలగింపు ప్రజాస్వామ్య విజయం

## -ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వివాదస్పద పాఠ్యాంశం తొలగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం న్యాయ వ్యవస్థతో పాటు ప్రజాస్వామ్య విజయమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సిఆర్‌టి) ఎనిమిదవ తరగతి సోషల్ సబ్జెక్టులో న్యాయ వ్యవస్థ అవినీతిమయం పాఠ్యాంశాన్ని పొందుపరిచిందన్నారు. న్యాయ వ్యవస్థ మూలాలను దెబ్బతీసేవిధంగా ఈ పాఠ్యాంశాలను రూపొందించిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి చెప్పడం హర్షణీయమన్నారు. ఇప్పటికే విద్యా విధానంలో మనుధర్మ శాస్త్రాన్ని చొప్పించి శాస్త్రీయ అవగాహనను దెబ్బతీసేవిధంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వివాదస్పద పాఠ్యాంశానికి సంబంధించి వ్యతిరేకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దానిని తొలగిస్తున్నట్లు ప్రకటించడాన్ని ఏఐఎస్ఎఫ్ స్వాగతిస్తుందన్నారు. ఇందుకు కారణమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఏఐఎస్ఎఫ్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. సమాజాభివృద్ధికి ఆటంకంగా ఉన్న మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేసే చర్యలను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, ఆకాష్, జిల్లా నాయకులు పవన్, సాయి, గోపి, చైతన్య, రమేష్, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పిల్లలకు పలకలు, బ్యాగ్స్ పంపిణీ





ప్రజాపక్షం/వైరా: వైరా పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డు శాంతినగర్ కేంద్రా ల్లో వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పిల్లలకు పలకలు, స్కూల్ బ్యాగ్స్ అందించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రానికి కిటికీలు లేని కారణంగా అవసర నిమిత్తం నాలుగు కిటికీలను అందించారు. గత కొన్ని సంవత్సరాలుగా అంగన్వాడీ కేంద్రంలో చేతిపంపు నిరుపయోగంగా ఉన్న విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఉండరు. వరలక్ష్మి శ్యామ్‌బాబు అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేపించి మంచినీటి బోరును పునరుద్ధరించారు. నిరుపయోగంగా ఉన్న చేతిపంపును పునరుద్ధరించడం పట్ల ఆ వార్డు ప్రజలు కౌన్సిలర్ వరలక్ష్మి శ్యామ్‌బాబును అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వరలక్ష్మి మాట్లాడుతూ 20వ వార్డులో కలివాల్సిన మౌళిక సదుపాయాలను అందిస్తామని, వార్డులో మంచినీటి సమస్య డ్రైనేజీ రహదారుల మరమ్మత్తు చేయించుట తన ముఖ్య ఉద్దేశ్యం అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మార్కెటింగ్ సభ్యులు తోటకూర శ్రీకాంత్, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, 20వ వార్డు ముఖ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వాంకుడోత్ బీక్యా, షేక్ రహీం, పండు, షేక్ రజిద్, గుగులోతు లక్ష్మీ బాయి, దుర్గా, విజయ్, గడసందుల దర్గయ్య, తేజ, రవి, సైదులు, కొమ్ము భాస్కర్, బానోతు భావసింగ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## -డిపివో కార్యాలయంలో వినతి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసి చైర్మన్ పిట్టల మల్లయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిట్టల మల్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తూ చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేని సిబ్బంది పేర్లను వెంటనే నమోదు చేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన సర్పంచ్‌లు, పాలక వర్గ సభ్యులు సిబ్బందిని తొలగిస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. అలా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గుమస్తా, బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న వారిని పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. గుమస్తా, బిల్ కలెక్టర్లకు రూ. 15,500, ట్రాక్టర్ డ్రైవర్, పంపు ఆపరేటర్, స్వీపర్ మొదలగు వారికి రూ.12,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు మేకల మల్లికార్జున్, బానోత్ మంగీలాల్, రాజగోపాల్, శ్రీకాంత్, ముత్యాలరావు, రాజేష్, మల్లేష్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు బి కేటగిరి వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/కొత్తగూడెం : నగర పాలక సంస్థ పరిధిలోని పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు బి కేటగిరీ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని బిల్డింగ్ ఆఫీస్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మున్సిపాలిటీలను అప్‌గ్రేడ్ చేస్తూ కార్పోరేషన్‌లుగా మార్పు చేసిన నేపథ్యంలో పెరిగిన ఖర్చులను దృష్టిలోపెట్టుకుని సంగరేణిలో పనిచేస్తున్న విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న సి కేటగిరీవేతనాల స్థానంలో బి కేటగిరీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక శాఖ ద్వారా విడుదల చేసిన కనీస వేతనాల బిటలో పేర్కొన్నట్లుగా ఏ బి సి గా విభజించిన కేటగిరీల్లో కార్పోరేషన్ పరిధిలో బి కేటగిరీ వర్తింపజేయాల్సారు. ఈ సమస్య పరిష్కారానికి సంగరేణి సంస్థ సానుకూలంగా ముందుకు రావాలని, కార్మిక అధికారులు దీనిపై చర్యలు తీసుకుని అమలుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు కే నర్సింహా, వినోద, అనసూయ, శాంత, లక్ష్మీ, సంజీవరావు, రమణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



ఖమ్మం జిల్లా 108 సిబ్బంది యర్రం అప్పారావు (సత్తుపల్లి), కాకర్ల మాధవరావు (వేంసూరు 108)లకు మూడు నెలలకు ఒకసారి ప్రదానం చేసే "స్టార్ ఈఎంటి" అవార్డును డాక్టర్ సురేష్ నారాయణ్ చేతుల మీదుగా అందజేశారు.

ప్రజాపక్షం/సత్తుపల్లి: 108 అత్యవసర సర్వీసుల ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ సత్తుపల్లిలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటల నిరంతర పర్యవేక్షణలో భాగంగా మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో నిర్వహిస్తున్న నాలుగు సేవలు (108, 102, 1962, ఎఫ్ హెచ్ ఎస్ ) సమన్వయంతో 30 సెకండ్లలో బయలుదేరే విధంగా నిర్వహణ జరుగుతోందని తెలిపారు. సత్తుపల్లిలోని 108 అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాల పనితీరు, మెడిసిన్ల గడువు తేదీలు, అంబులెన్స్ శుభ్రత, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు "గోల్డెన్ అవర్" విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. అర్బన్ (మైదాన), రూరల్ (గ్రామీణ), ఏజెన్సీ (గిరిజన) ప్రాంతాల్లో నిర్దేశిత సమయానికే చేరుకోవాలని ఆదేశించారు. అలాగే నెలవారీ కేసుల సంఖ్య పెంచడం, డ్యూటీలో అప్రమత్తంగా ఉండడం పై దృష్టి పెట్టాలని సూచించారు. డ్యూటీలో ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ యర్రం అప్పారావు, పైలెట్ షేక్ అన్వర్‌లను వారి సేవలకు అభినందించారు. ఇటీవల సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సురేష్ నారాయణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ సేవలు అందించిన 102 వాహనాన్ని పరిశీలిస్తూ కెప్టెన్ కట్టం మహేష్‌కు పలు సూచనలు చేశారు. పశుసంచార వాహన సిబ్బంది పేరావిట్ మల్లెల జగదీష్, కెప్టెన్ వేమూరి మహాకవి, హెల్పర్ షేక్ సుభానీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాలుగు సర్వీసుల మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# తొలగించిన ఇండ్లకు సంబంధించి సర్వే

## -అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

## -కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూముల ఆక్రమణలో ఈనెల 24న తొలగించబడిన ఇండ్లకు సంబంధించి వ్యక్తుల సామాజిక ఆర్థిక సర్వేను వెంటనే చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తుల సామాజిక ఆర్థిక సర్వే చేసేందుకు జిల్లాలోని 14 మంది తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇట్టి సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. సామాజిక ఆర్థిక సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికి ప్రభుత్వ ఆదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులు వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని కలెక్టర్ తెలిపారు.